మనమనోదేహములతోటి సంబంధం లేకుండా, అర్థకామాలతోటి సంబంధం లేకుండా, చావు పుట్టుకలతోటి సంబంధం లేకుండా మన హృదయములో ఏదో ఉంది అని స్ఫురించింది. ఏదో ఉంది, ఆ ఉన్నది నాకు తెలియటం లేదని కూడా తెలిసింది అన్నాడు. అది ఒక మహాజ్ఞానిని, ఒక ప్రేమస్వరూపుడిని దర్శించటం వలన వచ్చిన లాభము అన్నాడు ఆ సైంటిస్టు. మహాత్ములని దర్శించటం వలన ప్రయోజనం ఏమిటి అంటే వాడి హృదయంలో ఒక సత్యం ఉంది అది వాడికి తెలియటం లేదన్న సంగతి తెలుస్తోంది కాబట్టి అక్కడి నుంచి వాడికి తెలుసుకోవాలనే బుద్ధి కలుగుతుంది. ఆత్మజ్ఞానాన్ని సంపాదించటానికి డబ్బు అక్కరలేదు, జ్ఞానాన్ని తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే చాలు, జ్ఞాన సముపార్జనకు అదే పెట్టుబడి అన్నారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-02-2011, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకి సత్యం తెలియకపోవటానికి కారణం మన రూపబుద్ధి, నామబుద్ధి. మన రూపబుద్ధిలోనుండి, నామబుద్ధిలోనుండి బయటకు రావటానికి చాలాకృషి చెయ్యాలి, కఠినమైన సాధన చెయ్యాలి. సర్వానికీ నారాయణుడే కర్త అయినప్పటికీ తెలియని తనం వల్ల నేనే కర్తని అనుకుంటున్నాము, నేనే కర్తను అనుకున్నంతకాలం, మనిషికూడా నీడ ఎలా వెంటాడుతుందో అలాగ మనిషిని అశాంతి, దుఃఖం వెంటాడుతుంది. ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలోకూడా మనలను అశాంతి, దుఃఖం వెంటాడుతుంది. మనం కొన్ని మంచి పనులు చెయ్యాలి. మనం మంచిపనులు చేయలేకపోయినా ఎవరైనా మంచి పనులు చేస్తూ ఉంటే వారిని చూసి సంతోషించే యోగ్యత మనకి ఉండాలి. అలా సంతోషించే శక్తి లేని మీకా ఆత్మజ్ఞానం అన్నాడు పరమాత్మ. మీరు వందమందికి ఉపకారం చేయలేక పోవచ్చు కనీసం ఒకరికైనా ఉపకారం చేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. చదువు వచ్చిన మనిషి ఒక చదువులేని వాడికి చదువు చెబితే, ఒక ధనవంతుడు ఒక పేదవాడికి ఉపయోగపడితే, తెలివితేటలు ఎక్కువ ఉన్నవాడు తెలివితక్కువ వాడికి కొంచెం మాట సహాయం చేస్తే ప్రభుత్వంతోటి సంబంధం లేకుండా సోషలిజం ఈ దేశంలో వచ్చేస్తుంది అన్నారు.

మాకు శాంతిలేదు అని చాలామంది అంటారు. మీకు మమకారం ఉన్నప్పుడు, అహంకారం ఉన్నప్పుడు శాంతి దొరకదు అని పరమాత్మ గీతలో చెప్పాడు. శాంతిస్థానం దొరకాలి అంటే జ్ఞానమార్గంవల్లే అది తొందరగా సాధ్యమవుతుంది. స్థూలదృష్టి ఉన్నవాళ్ళు ఈ జ్ఞానమార్గంలో

నిలబడలేరు. నీకు సూక్ష్మదృష్టి ఉంటే మనస్సును డైరెక్టుగా కంట్రోలు చెయ్యి. నీకు సూక్ష్మదృష్టి లేకపోతే, నీకు బుద్ధిలో వివేకం లేనప్పడు నువ్వు శ్వాసమీద ధ్యాస పెట్టవచ్చు. దీనివలన కూడామనస్సు కొంత కంట్రోలులోనికి వస్తుంది. నువ్వు స్థూలబుద్ధితోటి ప్రయాణం చేసినా, సూక్ష్మబుద్ధితోటి ప్రయాణం చేసినా నీకు ఆత్మజ్ఞానం లేకుండా సత్యసాక్షాత్కారం కలుగదు. మీరు ఏ మార్గంలో ఉన్నప్పటికీ ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహారనియమంలేనివాడికి బుద్ధిలో క్లారిటీ రాదు. నీకు బుద్ధిలో క్లారిటీ లేనప్పడు ఇది నిత్యము, ఇది అనిత్యము, ఇది సత్యము, ఇది అసత్యము అని నువ్వు విభజన చేసుకోలేవు. ఆహారశుద్ధిలో నుండి చిత్తశుద్ధి వస్తుంది. చిత్తశుద్ధిలోనుండి భావశుద్ధి వస్తుంది. భావ శుద్ధి లేకుండా నీకు ఆత్మజ్ఞానము సాధ్యము కాదు. ఆధ్యాత్మిక జీవితానికి ఏమైనా ముగింపు ఉందా లేక ఇలా జపాలు, ధ్యానాలు చేసుకోవటమేనా అని చాలా మంది అడుగుతారు. మనోనాశనం అయితేనే కాని నీలోపల ఉన్న సద్వస్తువు నీకు తెలియబడదు. నీలోపల ఉన్న శాంతి సామ్రాజ్యానికి నువ్వు అధిపతి అయిన తరువాత నీకు అక్కడ ముగింపు ఉంది. ఎందుచేతనంటే నీలోపల ఉన్న శాంతి నీకు అనుభవంలోనికి వచ్చినవెంటనే, దానితో నువ్వు వన్‌నెస్‌ని సంపాదించిన వెంటనే, దానితోటి సమానమైన శాంతికాని, దానికిమించిన శాంతి కాని లేదని నీకు అనుభవంలోనికి వస్తుంది. ఆధ్యాత్మిక జీవితానికి అది ముగింపే. భగవద్గీతలో దీనికి ముగింపు చెప్పాడు.

**విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః।**

**నిర్మమో నిరహంకారః సశాంతి మధిగచ్ఛతి॥ (2-71)**

మనల్ని కొన్నికోరికలు బంధిస్తాయి, కొన్ని కోరికలు బంధించవు. మనకు పునర్జన్మని తీసుకువచ్చే కోరికలే ప్రమాదం. నువ్వు సాధన చేసి పునర్జన్మలని కలగజేసే కోరికలన్నీ వదులుకోవాలి. నిరహంకారం అంటే అహంకార రహితస్థితి. నిరహంకారస్థితి ఎలా వస్తుంది అంటే అది ఇంపెర్సనల్ బిహేవియర్ వల్ల వస్తుంది. అహంకారం అంటే చాలామంది కోపం అనుకుంటున్నారు. అహంకారం అంటే కోపంకాదు, దేహము పట్ల ఎవడికైతే ఆత్మబుద్ధి ఉందో వాడిని అహంకారి అని పిలుస్తారు. మనం చేసే సాధనలన్నీ నిరహంకారస్థితిని సంపాదించటానికే. మనకి నేను అనే తలంపు ఉన్నప్పడు నాది అనే తలంపు కూడా ఉంటుంది. మనకి నేను అంటే చైతన్యం స్ఫురించదు, మనకి దేహం స్ఫురిస్తుంది. అప్పడు ఈ దేహానికి సంబంధించిన వాళ్ళందరూ సిద్ధమవుతారు. మీ ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి మీకు చాలా

దుఃఖం వచ్చేస్తుంది, మీ పక్కింటి వారు ఎవరైనా చనిపోతే మీకు దుఃఖం రాదు. ఎందుచేత మీ ఇంట్లోవాళ్ళు చనిపోయినప్పుడు నాది అనిపిస్తుంది. దేహం నేను అనుకున్నంతకాలం నాది వస్తుంది. ఆ నాదిలోంచి మళ్ళీ దుఃఖం ప్రారంభమవుతుంది. అహంకారం లేనివాడికి మమకారం ఉండదు. అసలు దుఃఖం రావటానికి ఎటాచ్‌మెంటే కారణం. మీరు ప్రశాంతంగా కూర్చోండి. మీకు ఎక్కడా ఇష్టాలు లేవు అనుకోండి, ఎక్కడా అయిష్టాలు లేవు అనుకోండి అప్పుడు మీ మనస్సు ఎక్కడైనా చలిస్తుందేమో చూడండి. మీకు ఎక్కడైనా ఇష్టం ఉంటే మీ మనస్సు అక్కడ వాలుతుంది, మీకు అయిష్టం ఉంటే మీ మనస్సు అక్కడ వాలుతుంది. మీకు ఇష్టాలు, అయిష్టాలు లేవు అనుకోండి మీ మనస్సు ఇంక చలించదు.

కొంతమంది చెడ్డమాటలు మాట్లాడుతూ ఉంటారు. చెడ్డపనులు చేస్తూ ఉంటారు, వారికి చెడ్డ ఆలోచనలు వస్తూ ఉంటాయి. వాటి వలన మనకు ఉపయోగం ఉందా? పోనీ అవి ఈ లోకానికి పనికి వస్తాయా, పరలోకానికి పనికి వస్తాయా అంటే అవి దేనికి పనికిరావు. మరి అవసరంలేని మాటలు ఎందుకు మాట్లాడుతున్నారు? మనం పది పనులు చేస్తే ఎనిమిది పనులు అవసరంలేని పనులు చేస్తూ ఉంటాము. ఎందుకు ఇలా చేస్తున్నాము అంటే దానికి మనస్సు యొక్క చాపల్యమే కారణం. అహంకారం తోటి కలిసి నువ్వు తిరుగుతూ ఉంటే నీకు శాంతి ఎలా కలుగుతుంది. అహంకారం ఉంటే మమకారం వస్తుంది. మమకారం ఉన్నప్పుడు నీకు శాంతి ఎలా కలుగుతుంది. కొంతమంది నేను ఆ మంచిపని చేశాను, ఈ మంచిపని చేశాను అంటారు. నువ్వు ఏదైనా మంచిపని చేస్తే దాని తాలూకు స్పృహ కూడా ఉండకూడదు, ఎక్కడా నీకు ఆసక్తి పనికిరాదు. నువ్వు ఆసక్తిలోంచి విడుదల పొందకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు శాంతిరాదు. మీరు బంగారపు వస్తువులు మెడలో ఎలా అలంకరించుకుంటున్నారో అలాగ నేను అది సాధించాను, ఇది సాధించాను అని వాడు అనుకుంటూ ఉంటే ఆ నేను తాలూకు స్పృహలో నువ్వు ఎక్కువగా ఉంటే నీ ఈగో డెకరేట్ అయిపోతుంది. అంటే అహంకారం లోపల ముస్తాబు అయిపోతూ ఉంటుంది. అది నీకు తెలియదు. దేహాత్మబుద్ధిపోవటం చాలా కష్టం. దానికోసం ఎంతో సాధన చేయాలి. ఒకవేళ సాధన చేసినా గురువు అనుగ్రహం లేకపోతే, ఈ దేహాత్మబుద్ధిలోనుండి మనిషి విడుదల పొందలేడు.

శారీరక జీవితం, మానసిక జీవితం వీటికి సంబంధించినటువంటి స్పృహలేనివాడిని, అహంకారరహితుడిని, మమకారరహితుడిని మాత్రమే శాంతి వరిస్తుంది. అప్పటివరకూ

నువ్వు సాధనచేస్తూ ఉండవలసిందే. ఎప్పుడైతే ఈగో సెన్స్‌లోంచి నువ్వుబయటకు వచ్చావో అప్పుడు నీకు అందేది లౌకికమైన ఆనందం కాదు, బ్రహ్మానందాన్ని పొందుతావు. మేము దేహగతమైన నేను కోసమే జీవిస్తున్నాము కదా! ఈ నేనుని పోగొట్టుకుంటే ఎలాగండి అని చాలామంది అనుకుంటారు. ఎంతసేపు ఆ నేనుతోనే కలిసి జీవిస్తాడు కదా, అందుచేత ఆ నేను పోతే వాడు పోతాను అనుకుంటాడు. ఆ నేను పోతే వాడు పోడు, వాడు ఎవడో వాడికి తెలియబడుతుంది. దానినే బ్రాహ్మీస్థితి అంటారు. అది మొదలు, చివర లేని పరమస్థితి. ఇక్కడ పరమాత్మ ఏమని చెబుతున్నాడు అంటే నీ దేహం ఈ భూమిమీద తిరుగాడుతున్నప్పడే ఆ బ్రాహ్మీస్థితిని పొందితే మంచిదే కాని ఇప్పడు నువ్వు పొందలేవు అనుకో నీశరీరం పోయే టైముకి అయినా నువ్వు కష్టపడి సాధనచేసి, సాధనచేసి అంత్యకాలంలో, నీ ప్రాణంపోయే టైములో అయినా బ్రాహ్మీస్థితిని నువ్వు పొందగలిగితే నువ్వు మోక్షసుఖాన్ని పొందుతావు, అప్పడు ఇంక నీకు పునర్జన్మలేదు. మీ శరీరం చనిపోయేటప్పడు మీరు పూర్తిగా ఆనందంగా ఉన్నారా? లేదా? చూసుకోండి. అంటే బాహ్యపరిస్థితులతోటి సంబంధం లేకుండా, మీ కుటుంబ పరిస్థితులతోటి సంబంధం లేకుండా, మీదేహ ప్రారబ్ధంతోటి సంబంధం లేకుండా మీ ప్రాణప్రయాణ టైములో మీరు నూటికి నూరుపాళ్ళు బ్రహ్మానందంలో ఊగిసలాడుతూ ఉంటే వాడికి పునర్జన్మలేదు అర్జునా అన్నాడు పరమాత్మ.

**తేజః క్షమాధృతి శ్శౌచం, అద్రోహూ నాతిమానితా**

**భవన్తి సమ్పదం దైవీ మభిజాతస్య భారత**

మనభారతదేశంలో జన్మించినటువంటి మహావీరులలో అర్జునుడు ఒకడు. అటువంటి అర్జునుడినే పరమాత్మ భవసవ్యసాచిన్ అన్నాడు. అంటే నువ్వు ఊరికే చేతులు ఆడించు, పని అంతా నేను చూసుకుంటాను అన్నాడు. పని అంతా నాది గౌరవం నీకు అన్నాడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ చెబుతున్నాడు. తేజః అంటే తేజస్సు. మహాత్ములు, మహర్షులు, యోగుల దగ్గరికి వెళ్ళిచూస్తే మీకు వారి ముఖంలో తేజస్సు తెలుస్తూ ఉంటుంది, ఆనంద ప్రభావం ఆ ముఖంలో కనిపిస్తూ ఉంటుంది. మనం స్నో రాసుకోవటం వలన, పౌడరు రాసుకోవటంవలన తెచ్చుకొనే తేజస్సు కాదు అది. సాధన వలన వైరాగ్యం వలన, యోగం వలన, జ్ఞానం వలన నీకు కొంత తేజస్సు కలుగుతుంది. ఆ తేజస్సు కలవారి దగ్గరకు వెళ్ళి నువ్వు కూర్చుంటే ఆ తేజస్సు నీకు స్పష్టంగా

కనిపిస్తూ ఉంటుంది. మన సాధనతోటి సంబంధం లేకుండా గౌతమ బుద్ధుడు ముఖంలో ఉన్న ఆ తేజస్సు చూసి 150 మంది ఆత్మజ్ఞానం పొందారు అని చెబుతారు. బుద్ధుడు సవతి తమ్ముడు ఆనంద్ మాత్రం ఆ తేజస్సు యొక్క ప్రభావం వలన బ్రాహ్మీస్థితి పొందలేకపోయాడు. దానికి కారణం ఏమిటంటే బుద్ధుడు మన అన్నగారు అనే భౌతిక దృష్టి ఆయనకు పోలేదు. ఆ ఎటాచ్‌మెంట్ పోగొట్టుకోలేకపోయాడు. అందుచేత ఆనంద్ ఆ తేజస్సును పొందలేకపోయాడు.

క్షమ అంటే ఓర్పు, సహనము. వారు ఏదో అన్నారని నేను ఏదో అనేశాను అని మాటకి మాట అందించేయటం అక్కరలేదు. నీకు సహనం పెరగాలి. సహనం ఉన్నవాడికి ఎంతో కొంత హృదయం యొక్క లోతులు పెరుగుతాయి, సహనం లేనివాడికి హృదయం యొక్కలోతులు పెరగవు. మనకి క్షమ ఉండాలి, ధైర్యం ఉండాలి. దైవీ సంపదకి నాయకుడు ధైర్యం అన్నారు. మనల్ని అవమానపరచే వాళ్ళు ఉన్నా మనం సహనం పోగొట్టుకో కూడదు. మీకు యాక్షన్ ఉండాలి కాని రియాక్షన్ ఉండకూడదు. మీరు ఇన్‌సల్ట్‌ని బేర్ చేయలేనప్పుడు మీకు తూకం ఎలా పెరుగుతుంది. తూకం పెరగదు. మనిషికి తూకం పెరగాలంటే సాధన చెయ్యాలి, ఇమ్‌పెర్సనల్ లైఫ్ ఉండాలి. మన బిహేవియర్ ఇమ్‌పెర్సనల్‌గా ఉండాలి. అప్పుడు ఆమనిషి తూకం పెరుగుతుంది కాని కేవలం పాండిత్యంవల్ల, ధనంవల్ల హృదయం యొక్క లోతులు పెరగవు. శౌచం అంటే శుచిగా ఉండాలి. లోపల శుచి ఉండాలి. బయట శుచి ఉండాలి. నీ శరీరాన్ని సబ్బుపెట్టి తోముకుని ఎలా శుచిగా ఉంచుకుంటున్నావో అలా భగవంతుడిని స్మరించటం వలన, ప్రార్ధన చేయటం వలన నీ మనస్సుకి శుచి కలుగుతుంది. భగవంతుడిని మన కళ్ళతో చూడలేకపోయినా భగవంతుడి నామం మనం వింటున్నాము. ఆ నామాన్ని మనం శ్రవణం చేయటం వలన, మననం చేయటం వలన మనకి మానసికంగా భగవంతుడితో అనుబంధం కలుగుతుంది. భగవంతుడితో ఎప్పుడైతే అనుబంధం కలిగిందో అప్పుడు భగవంతుడిని తెలుసుకోవాలనే జిజ్ఞాస మనకు పెరుగుతుంది . మహాత్ముల దర్శనం ఎందుకు చెయ్యాలంటే వారిని దర్శనం చేయటం వలన మనలో ఏదో ఉంది, దానిని తెలుసుకోవాలిఅనే కాంక్ష మనకు కలుగుతుంది. జ్ఞానానికి పెట్టుబడి ఐశ్వర్యం కాదు, జ్ఞానానికి పెట్టుబడి తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి. అద్రోహః ఎవరికి ద్రోహం తలపెట్టకు. మనం ఎవరికైనా ద్రోహం చేస్తున్నాము అంటే మనకి మనమే ద్రోహం చేసుకుంటున్నాము అని మరిచిపోకండి. అంటే మనం చేసిందంతా తిరిగి

మనకే వస్తుంది. మీరు ఎవరినీ ఆక్షేపించకండి. మీరు ఎవరినైతే ఆక్షేపించారో మళ్ళీ వాళ్ళచేతే మీరు ఆక్షేపింపబడతారు. అది దేవుడి చట్టం.

**నఅతిమానితా :** ప్రజలందరూ నన్ను గొప్పవాడని చెప్పకోవాలి, నాలో ఏమీ విశేషం లేకపోయినా నాలో ఏదో విశేషం ఉన్నట్లు ప్రజలందరూ చెప్పకోవాలి, అందరూ నన్ను పూజించాలి, నాకు సన్మానాలు చెయ్యాలి అని ఇటువంటి లక్షణాలన్నీ ధనంలోంచి వస్తాయి. నువ్వు ఇద్దరికి ఒకేసారి పాలేరుతనం చేయగలవా అన్నాడు ఏసు. ఇటు జ్ఞానానికి, అటు ధనానికి రెండింటికి ఒకేసారి నువ్వు పాలేరుగా ఉండగలవా అన్నాడు. ధనం వచ్చినవాడికి మదం వస్తుంది. సూది బెజ్జంలోంచి ఒంటెని పంపవచ్చుగాని, ధనవంతుడిని స్వర్గరాజ్యం లోనికి పంపలేము అని ఏసు చెప్పాడు. నన్ను అందరూ గౌరవించాలి అనే బుద్ధి ఉండకూడదు, ఇవన్నీ ఆత్మజ్ఞానం పొందటానికి అడ్డంకులు. త్యాగం అంటే మీరు ఎవరికో పదిరూపాయలు ఇవ్వటం త్యాగం కాదు, ఎవరికో ఒక మాట సహాయం చెయ్యటం త్యాగం కాదు. ఇవి బాహ్యవిషయాలు మీకు జ్ఞానం సంపాదించటానికి మీ లోపల ఏ విషయాలు అడ్డు వస్తున్నాయో చూసుకోండి, మన మనస్సు బాహ్యముఖం అవ్వటానికి కారణాలు ఏమిటి? మన మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటి? అని మీరు పరిశీలన చేసి చూసుకుంటే మీకు కొన్ని అయినా తెలుస్తాయి. వాటిని మీరు విడిచిపెట్టగలగటమే నిజమైన త్యాగం. మనం ఏదైనా తినేటప్పడు ఇది సరిపోతుంది అని దేహం చెబుతుంది. కాని దేహం చెప్పినా ఇంకా తినేస్తూ ఉంటాము. అది రోగానికి కారణం అవుతుంది. దేహం సరిపోతుంది అని చెప్పినప్పడు ఆ తిండి ఆపు చెయ్యటం కూడా త్యాగమే. నువ్వు ఆ రుచిని విడిచిపెట్టగలగాలి. బ్రాహ్మీస్థితి పొందటానికి ఏ విషయం అడ్డువచ్చినా దానిని నువ్వు మెర్సిలెస్‌గా విడిచిపెట్టటం నిజమైన త్యాగం.

**దయా భూతేషు అలోలత్వం :** నీ ఇంద్రియాలకు ఎన్ని ఆకర్షణలు ఉండాలో అన్ని ఆకర్షణలు ఎదురుగుండా ఉన్నప్పటికీ వాటిచేత నువ్వు ఆకర్షించబడకుండా, నువ్వు నిర్వికారంగా ఉండగలిగితే అది దైవీసంపద. ఆ దైవీసంపదను దేవుని అనుగ్రహం లేకుండా నువ్వు పొందలేవు. జ్ఞానసముపార్జనకి నీ మనోనిగ్రహం, నీ ఇంద్రియనిగ్రహం సహకరించాలి. మీ మనస్సు, మీ ఇంద్రియాలు మీ స్వాధీనములో ఉన్నాయి అనుకోండి ప్రపంచంలో ఉన్న జనం అందరూ మీకు శత్రువులు అయినా మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మీరు ఏ చింతలేకుండా హాయిగా బ్రతకగలరు. ఇది గుర్తుపెట్టుకోండి. అర్జునా నువ్వు బాగుపడటానికి

నీమనస్సే కారణం, నువ్వు పాడైపోవటానికి అయినా నీమనస్సే కారణం. నీమనస్సుని నువ్వు విరోధిగా చేసుకోకు, నీమనస్సుని నువ్వు స్నేహితుడిగా చేసుకో. చేప నీటికి ఎదురు ఈదుతూ ఉంటుంది, అలాగే ఏ విషయాలు అయితే నీమనస్సుని బాహ్యముఖం చేస్తున్నాయో వాటికి ఎదురీదు. మనస్సుకు ఎదురు ఈదటం నేర్చుకుంటే మనస్సు ఎక్కడ నుంచి వస్తుందో నువ్వు అక్కడికి వెళ్ళిపోతావు అన్నాడు పరమాత్మ. భగవంతుడు నీకు ఏది కేటాయిస్తే దానితోటి సంతృప్తిపడి నీపని నువ్వు చేసుకుంటూ ఉండు. నీదికానిది ఆశించకు. ప్రపంచంలో కనిపిస్తున్న సంపద అంతా ఈశ్వరుడిదే. ఆ ఈశ్వరుడి సంపదే నాది అనుకొని నువ్వు మళ్ళీ దాట్లోంచి పేరు ప్రఖ్యాతులు ఆశిస్తున్నావు దీనికి భగవాన్ అన్నారు ఒకడు మొత్తం బెల్లంతోటి వినాయకుడిని చేశాడు. వాడికి నైవేద్యం పెట్టటానికి ఏమీ లేదు. అప్పడు వాడు ఏమి చేశాడు అంటే ఆ వినాయకుడిని పట్టుకుని గట్టిగా గిల్లేశాడు, కొంత బెల్లం బయటకు వచ్చింది దానినే నైవేద్యం కింద పెట్టి పూజ చేసేశాడు. మనం చేసేది కూడా అంతే. సంపద అంతా ఈశ్వరుడిదే, ఈశ్వరుడి సంపద ఈశ్వరుడికి సమర్పించి నేను ఇచ్చాను అనుకుంటున్నావు. నీ అజ్ఞానం వల్ల నేను ఇచ్చాను అనుకుంటున్నావు. అసలు నువ్వు ఉన్నావా ఇవ్వటానికి అన్నారు భగవాన్.

ఆలోచన, మాట, చేత, మూడూ నిదానంగా ఉన్నవాడే జ్ఞానసముపార్జనకి యోగ్యత సంపాదిస్తాడు. అంత మాత్రంచేత జ్ఞానం వస్తుందని కాదు. సత్యము కూడా తింగరతనంగా చెప్పకూడదు, హితవుగా చెప్పాలి, భాష మృదువుగా ఉండాలి. నువ్వు ఎవరికైతే చెబుతున్నావో వాళ్ళ క్షేమంకోరి చెప్పాలి కాని నోటికి వచ్చినట్లు చెప్పకూడదు. దయాభూతేషు అంటే అన్ని భూతాలపట్ల దయ కలిగి ఉండాలి. రమణమహర్షిగారి దయ మనుషులకి పరిమితం అవ్వలేదు. జంతుజాలం వరకు వాళ్ళ ప్రేమ వ్యాపించింది. దానికి హద్దులు లేవు. జ్ఞానియొక్క శాంతి, జ్ఞానియొక్క ప్రేమ కొండలని దాటుతుంది, నదులని దాటుతుంది, సముద్రాలని దాటుతుంది, ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. అదే నిజమైన ప్రేమ.

మీకు మీగ్రామం మీదే ప్రేమ ఉంది అనుకోండి లేకపోతే మీదేశం మీదే ప్రేమ ఉంది అనుకోండి, మీకు ఇంక ఎక్కడా ప్రేమ, ఆప్యాయత, ఇష్టం లేదు అనుకోండి అది నూటికి నూరుపాళ్ళు అహంకారం. మీకు ఏమైనా చెడ్డ తలంపులు వస్తూ ఉంటే మిమ్మల్ని చూచి మీరే సిగ్గుపడండి. ఇటువంటి ఆలోచనలు వస్తున్నాయి ఏమిటి, ఇటువంటి పనులు చేస్తున్నాను

ఏమిటి, ఇటువంటి మాటలు మాట్లాడుతున్నాను ఏమిటి అని మీ జీవితాన్ని మీరు పరిశీలన చేసుకోండి. మనస్సులో చపలత్వం లేకుండా చూచుకోండి, చపలత్వాన్ని నిగ్రహించుకోండి, మీకు చపలత్వం తగ్గిపోతే ఉపయోగంలేని తలంపులు, ఉపయోగంలేని మాటలు, ఉపయోగంలేని చేష్టలు అన్నీ తగ్గిపోతాయి. వీటన్నింటికి కారణం మనస్సే. బైబిల్‌లో ఒకమాట ఉంది మీదేహం ఆరోగ్యంగా ఉండటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు, మీ దేహాన్ని శుచిగా ఉంచటానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు కానీ మీదేహం చనిపోయాక మీకూడా వచ్చే మనస్సుని బాగుచేసుకోవటానికి దానిని పరిశుద్ధం చేసుకోవటానికి కొంచెము కూడా మీరు ప్రయత్నం చెయ్యరా? మీ మనస్సు పరిశుద్ధముగా ఉంటే అది బ్రాహ్మీస్థితిని పొందటానికి మీకు సహాయ సహకారములు అందిస్తుంది. మీ మనస్సుని పవిత్రం చేసుకోవటానికి కనీసం మీ దేహానికి ఇచ్చే విలువ కూడా మీ మనస్సుకి ఇవ్వరా అన్నాడు ఏసు.

భగవంతుడు రూపాన్ని ధ్యానం చేయటం వలన, ఆ నామాన్ని స్మరించుకోవటం వలన మన రూపబుద్ధికి, మన నామబుద్ధికి దూరం అవుతూ ఉంటాము. ఇంక నువ్వే ఉన్నావు, నేను లేను అనే బుద్ధి కలుగుతుంది. మనం ఇష్టదైవాన్ని స్మరించటంవల్ల ఆ ఇష్టదైవమే సర్వస్వం అనికాదు. ఇష్టదైవం ద్వారా మనం బ్రహ్మములో ప్రవేశిస్తాము. మనం అన్ని గ్రంధాలు చదవకూడదు. మనకి బ్రాహ్మీస్థితి పొందటానికి అనుకూలమైనటువంటి గ్రంధాలు చదవాలి. రాత్రి నిద్రపోయేముందు అందరూ మీ ఇష్టదేవతను స్మరించుకోండి, ఆ స్మరణ నిద్దట్లో కూడా మీకు జరుగుతూ ఉంటుంది. భగవంతుడి నామం ద్వారా కూడా మనం భగవంతుడిని పొందవచ్చు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-03-2010, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆచార, విచార, ప్రచార వీటి గురించి మన సాంప్రదాయంలో చెపుతారు. ఆచారం ఉన్నవాడే ఆచార్యుడు. ఆచారం అంటే క్రమశిక్షణ ఉండాలి. గురువుకి ఆచార్యుడి లక్షణాలు ఉండనక్కరలేదు కాని ఆచార్యుడికి గురువులక్షణాలు ఉండాలి. రామకృష్ణుడు, రమణుడు వీరు గురువులు. శంకరుడు, రామానుజుడు, మధ్వుడు వీరు ఆచార్యులు. గురువులు వారి అనుభవాన్ని చెపుతారు. వారి అనుభవానికి వేదానికి సరిగ్గా బంగారం తూచినట్లుగా సరిపోతుంది. ఆచార్యుడు అంటే గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు తీసుకుని సబ్జక్టు